క్లుప్తంగా

ద్రవజీవామృతం తయారీపై అవగాహన



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస: చీడివలస గ్రామంలో వ్యవసాయశాఖ సహకారంతో సబల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళారైతులకు ద్రవ జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయం ఏపీఎం వెంకటరమణ అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ జీవామృతం సజ్జ నారుమడులను ఎండ తీవ్రత నుంచి రక్షించేందుకు అమృతంలా పని చేస్తుందన్నారు. మొక్క ఎదిగేందుకు కావాల్సిన పోషకాలను అందిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భూరీసర్వేకు సహకరించండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సన్యాసినాయుడు

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా చేపట్టనున్న సమగ్ర భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సన్యాసినాయుడు కోరారు. బానాది గ్రామంలో భూరీసర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి బానాది రెవెన్యూ పరిధిలో సర్వే చేయనున్నామని చెప్పారు. సర్వే చేసే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండి సిబ్బందితో భూముల వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలో రాయుడుపేట, జమ్మాదేవిపేట గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని, చామలాపల్లి, అరిగిపాలెం, నీలకంఠరాజపురం గ్రామాల్లో సర్వే కొనసాగుతోందని చెప్పారు.

కొత్తవలస తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా



తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రాకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

కొత్తవలస: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ప్రసాదరావుకు బొండపల్లి బదిలీ కావడంతో అక్కడి నుంచి శ్రీనివాస్ మిశ్రా కొత్తవలసకు వచ్చారు. ఆయనకు హెచ్‌డీటీ రమేష్, ఆర్ఐ రాజేష్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ తవుడు

గజపతినగరం రూరల్: జాతీయ ఉపకారవేతనానికి అర్హత సాధించిన ముచ్చర్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.రమణ, పి.గణేష్‌కు జెడ్పీటీసీ గార తవుడు రూ.2 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. హెచ్ఎం లెంక రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ పరిపాలన అధికారి సుదర్శనం

గజపతినగరం: ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికే ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కిశోర్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట

- పాఠశాలలు పునఃప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక పంపిణీ

విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, విద్యారంగంలో సంస్కరణలు తీసుకువస్తూ పేద పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. 2023- 24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలోని 1 నుంచి 10వ తరగతి పిల్లలకు జగనన్న విద్యాకానుక(జేవీకే)కిట్లను వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే ప్రభుత్వం అందజేసింది. విద్యాకానుక పంపిణీ పండగలా సాగింది. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని, పేదరికం చదువుకు ఆటంకం కాకూడదని సీఎం జగన్ చెబుతుంటారని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే ఆయన తాపత్రాయమని అన్నారు. ప్రభుత్వం విద్యాకానుక పేరిట విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టు, బ్యాగులు, వర్క్ బుక్‌లు, డిక్షనరీలను అందిస్తోందని చెప్పారు. పేదపిల్లల చదువుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. - సాక్షి నెట్ వర్క్



కొత్తవలస: కొత్తవలస ఉన్నత పాఠశాలలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, తదితరులు



గజపతినగరం రూరల్: ముచ్చర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థికి విద్యాకానుక అందజేస్తున్న జెడ్పీటీసీ తవుడు



చీపురుపల్లి: చీపురుపల్లి బాలికోన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శిరీష, సర్పంచ్ సుధారాణి తదితరులు



గంట్యాడ: రామవరం హైస్కూల్‌లో కిట్లును అందజేస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు



జామి: కుమరాం కేజీబీవీలో విద్యార్థినులకు విద్యాకానుక అందజేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ పద్మావతి



బొండపల్లి: బొండపల్లి హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జేవీకే రాష్ట్ర పరిశీలకులు కల్పన, ఎంపీపీ చలం నాయుడు



గుర్ల: పాలవలస హైస్కూల్‌లో నిర్వహించిన విద్యాకానుక పంపిణీలో ఎంపీప ప్రమీల, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోట హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు



లక్కవరపుకోట: గంగుబూడి హైస్కూల్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు



వేపాడ: నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు



గజపతినగరం: పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న జేవీకే రాష్ట్ర పరిశీలకులు కల్పన



దత్తిరాజేరు: కేజీబీవీలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి

నిరుపేద బాలికలకు ఆశ్రయం

గుర్ల: మండలంలోని తాతావారి కిట్టాలి గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద బాలికలకు ఆశ్రయం కల్పించినట్లు రాష్ట బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు సోమవారం తెలిపారు. ఈ బాలికల తల్లి మరణించి ఏడాది కావస్తోంది. తండ్రి వారి బాధ్యతలను మరచి, పట్టించుకోకుండా అనాథలుగా వదిలేశాడు. వీరు పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఇటీవల గ్రామానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే జెడ్పీ చైర్మన్ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అప్పారావుకు సమస్యను వివరించి పరిష్కరించాలని సూచించారు. ఈమేరకు తాతావారి కిట్టాలిలో అప్పారావు సోమవారం పర్యటించారు. బాలికలకు జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో పునరావాసం కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఇద్దరిని చదివిస్తామని పేర్కొన్నారు.



బాలికల వివరాలు తెలుసుకుంటున్న కేసలి అప్పారావు

పూరిల్లు దగ్ధం

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో బోకం దేముడుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆయన అంత్యక్రియల్లో కాల్చిన బాణసంచా పూరిల్లుపై పడడంతో నిప్పు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, సామగ్రి, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టండి

శృంగవరపుకోట: పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎల్‌పీఓ మోహన్‌రావు సూచించారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని కన్నెంగెడ్డలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.వి.జె.పాత్రో తదితరులు ఉన్నారు.

రామాలయ పునః నిర్మాణానికి కోలగట్ల విరాళం

విజయనగరం: నగరంలోని 27వ డివిజన్ పరిధి జొన్నగుడ్డి రుప్పవీధిలో రామాలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం శాస్త్రోక్తంగా పునః నిర్మాణ శంకుస్థాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, కార్పొరేటర్ సునీత, ఆ ప్రాంత పెద్దలు రుప్ప సూరప్పారావు, ఎస్.శ్రీనివాస్, లింగాల చినబాబు, కె. పైడిరాజు, కె.లక్ష్మణరావు, డి.బుజ్జి పాల్గొన్నారు.

నవరత్న పథకాలు పేదలకు వరం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేద, బడుగు, బలహీనవర్గాలకు వరమని, పేదల ఆర్థికాభివృద్ధికి ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చామలాపల్లి గ్రామంలో సోమవారం సాయింత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ 99 శాతం అమలు చేశారని అన్నారు. ఎంపీపీ సత్యవంతుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, సర్పంచ్ కోలా సతీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.జగ్గుబాబు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బోజంకి శ్రీను, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 25వ డివిజన్ రంగాల వీధిలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, 14.5 లక్షల రూపాయలతో సామాజిక భవనం నిర్మించడం సంతోషించదగ్గ విషయమన్నారు. స్థానికుల ఎన్నో ఏళ్లనాటి కల అయిన సామాజిక భవనం ఏర్పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వల్ల సాకారమైందని చెప్పారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి మాట్లాడుతూ, సామాజిక భవన నిర్మాణానికి చొరవ చూపిన కోలగట్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, డివిజన్ ఇన్‌చార్జ్ యడ్ల రాజేష్, స్థానిక నాయకులు ఏఏ రావు, భీశెట్టి ఓం శంకర్, ఆడారి వెంకటేశ్వరరావు, ఎంకేబీ శ్రీను, నగేష్, కాండ్రేగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం



స్వామి వారిని దర్శించుకుంటున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండల కేంద్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి, 8 గంటలకు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్వామి వారిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు దర్శించుకున్నారు. ఆయనతో వేదపండితులు పూజలు చేయించి, ఆశీర్వచనం అందించారు. ఆలయ నిర్మాణకర్త ముదునూరు అశోక్ దంపతులు జెడ్పీ చైర్మన్‌ను సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కె.గుర్రాజు, లెంకభాస్కరరావు పాల్గొన్నారు.

రామాలయం పునఃప్రతిష్ఠ

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో రామాలయం పునఃప్రతిష్ఠను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు, స్థానికుడు, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ చైర్మన్ మంత్రి అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు పూజల్లో పాల్గొన్నారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠ

వేపాడ: మండలంలోని చామలాదేవీ అగ్రహారంలో రామాలయం ప్రారంభోత్సవంలో భాగంగా సీతా రామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠాపన గ్రామపెద్దలు, గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గ్రామస్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో రామాలయ పునఃప్రతిష్ఠకు వచ్చిన ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు స్వాగతం పలుకుతున్న వేదపండితులు



వేపాడ: చామలాదేవీ అగ్రహారంలో సీతారాముల నుదర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ కస్తూరి, తదితరులు

సచివాలయ వ్యవస్థతో సేవలు చేరువ



భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గంట్యాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో రూ.62 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను సోమవా రం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ సాకారం చేశారని అన్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రభుత్వసేవల కోసం ప్రజలకు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పని, వ్యయ ప్రయసాలు తగ్గాయని తెలిపారు. సొంత గ్రామాల్లోనే సుమారు 500 రకాల సేవలు పొందగలుగుతున్నారని అన్నారు. సచివాలయాలకు గ్రామ వలంటీర్లను ప్రభుత్వం అనుసంధానించిందని, వలంటీర్లు తమ 50 కుటుంబాల పరిధిలో అర్హత ఉన్న వారి ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ డబ్బులు అందిస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందిస్తున్నామని, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సాగు సంబంధ సూచనలు, సలహాలు అందిస్తున్నారని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తులను కూడా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం మురపాక గ్రామానికి చెందిన జి. సన్యాసమ్మకు ఇంటి పట్టాను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ భానోజీరావు, తహసీల్దార్ ప్రసన్న రాఘవ, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సిరిపురం సర్పంచ్ గుండపు పద్మావతి, మురపాక సర్పంచ్ ఈదుబిల్లి రమేష్, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మురపాకకు చెందిన సన్యాసమ్మకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



ఉచిత వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: రంగస్థల కళాకారిణి కలగ కోటేశ్వరీదేవి వర్ధంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరాన్ని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. 11వ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మేయర్ విజ యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి మాట్లాడుతూ,నాటకరంగంలో కోటేశ్వరీదేవి మరపురాని ఎన్నో పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందిందన్నారు. రాజ్‌కుమార్, డిప్యూటీ మేయర్ లయాయాదవ్ పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లించవచ్చు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భవన యజమానులు ఈనెల 30 లోగా వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించవచ్చని కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 30తో గడువు ముగియనున్నట్లు పేర్కొన్నారు. గడువు తర్వాత పన్ను చెల్లిస్తే రెండు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భవన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు.